సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023




ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యం

ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా పేద విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదు. 8లో▸

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. 9లో▸



గరిష్టం/కనిష్టం
29.0/15.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పత్తి తూకాల్లో మోసాలు అరికట్టాలి



జెడ్పీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కైలాస్‌నగర్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తి తూకాల్లో మోసాలు అరికట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్రా దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీఐకి పత్తిని విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు జమఅయ్యేలా చూడాలన్నారు. అలాగే నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులతో రైతులు మోసపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో పార్టీ నాయకులు రాములు, దేవిదాస్, కేశవ్, ఉస్మాన్ తదితరులున్నారు.

28న ‘మత్స్య’ సంఘాల అధ్యక్షులతో సమావేశం

కైలాస్‌నగర్: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులతో ఈ నెల 28న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ప్రకటనలో తెలిపారు. పది మంది సభ్యులతో కూడిన తాత్కాలిక జిల్లా కార్యవర్గం, చీఫ్ ప్రమోటర్‌ను ఎన్నుకుని జిల్లా సంఘాన్ని రిజిస్టర్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జరిగే సమావేశానికి అన్ని మండలాల అధ్యక్షులు మాత్రమే సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్‌వీవీ వరప్రసాద్

తలమడుగు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానికులు గ్రామ సమస్యలను న్యాయమూర్తికి విన్నవించగా.. సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం గ్రామంలో కాడే స్వామి ఆధ్వర్యంలో దాదాపు 100 మంది గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, పేద విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఇందులో అదనపు న్యాయమూర్తి శివరామ్ ప్రసాద్, సర్పంచ్. రాధామనోహర్, లీగల్‌సెల్ అథారిటీ అధికారి క్షేమా దేశ్‌పాండే, తహసీల్దార్ రాజమోహన్, ఎంఈవో నారాయణ, వైద్యాధికారి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో కోవిడ్ ముప్పు దూరం

ఆదిలాబాద్‌టౌన్: అప్రమత్తతతో కోవిడ్ ముప్పు నుంచి దూరంగా ఉండవచ్చని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1 ప్రబలుతున్న నేపథ్యంలో శనివా రం రిమ్స్ ఆసుపత్రిలో వసతుల సన్నద్ధతపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. రిమ్స్‌లో ప్రత్యేకంగా ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోగుల చికిత్సకు అవసరమైన ఆక్సిజన్ బెడ్స్, వెంటిలేటర్లు, మెడిసిన్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలని సూచించారు. సమావేశంలో రిమ్స్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ముక్కోటి’ పూజలు



స్వామివారికి హారతినిస్తున్న వేదపండితుడు



జైనథ్ శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పల్లకి శోభాయాత్రలో భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



దర్శనానికి తరలివచ్చిన భక్తులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లావాసులు ముక్కోటి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాల శ్రీవేంకటేశ్వర ఆలయం, మంగమఠం, శ్రీరామచంద్ర గోపాల కృష్ణమఠం, జైనథ్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలు సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మార్వాడి ధర్మశాలలోని శ్రీవెంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. – ఆదిలాబాద్



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- పని కాకపోయినా అవుతుందని చెప్పడం సరికాదు
- ప్రభుత్వ తప్పిదాలను మీపైకి ఎందుకు తీసుకుంటారు..
- శాఖల్లో నిధులు లేవు.. అది వాస్తవమని తెలుపాలి..
- ప్రజలకు ప్రశ్నించే హక్కు కల్పించాలి
- అధికారులకు కాంగ్రెస్ సర్కార్ తీరును స్పష్టం చేసిన ఎమ్మెల్యే బొజ్జు
- సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు



ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేల కరచలనం



బొజ్జు, అనిల్ ఆత్మీయ ఆలింగనం..

ఉన్నది ఉన్నట్లు చెప్పండి..

సాక్షి,ఆదిలాబాద్: ‘ఉన్నది ఉన్నట్లు చెప్పండి.. పని కాకపోయినా అవుతుందని చెప్పడం ఏంటి.. వానాకాలం, రబీలలో వర్షాలతో పంట నష్టపోతే మూడు సార్లు సర్వే చేశారు. పరిహారం మాత్రం చెల్లించలేదు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగితే పంట నష్టం వస్తుందని చెప్పారు.. వాస్తవానికి రాలేదు. వారికి ఉన్న పరిస్థితి చెప్పితే.. ధర్నా చేస్తారా.. మరేమి చేస్తారో.. వారిష్టం. ఇదొక్కటే అని కాకుండా ప్రతీ అంశంలోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వ తప్పిదాలను మీపైకి ఎందుకు తీసుకుంటారు. ప్రజలకు ప్రశ్నించే హక్కు కల్పించాలి.. ’ శనివారం నిర్వహించిన జెడ్పీ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన వ్యాఖ్యలివి. ఈ మీటింగ్‌లో జిల్లా అధికారులకు కాంగ్రెస్ సర్కార్ తీరును ఒక విధంగా ఆయన స్పష్టం చేశారు.. బీఆర్ఎస్ ప్రభుత్వ తీరునుంచి బయటకు రావాలని ఈ మాటల ద్వారా తేటతెల్లం చేశారు.



ప్రతీ అధికారి హాజరవ్వాలి

ప్రజా సమస్యలపై చర్చించే జెడ్పీ సమావేశానికి ప్రతీ శాఖ ఉన్నతాధికారి తప్పకుండా హాజరు కావాలి. ఇందులో ఎవరికి మినహాయింపు లేదు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించే అంశాలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నూతన ఎమ్మెల్యేల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చొరవ చూపాలి. – జనార్దన్ రాథోడ్, జెడ్పీ చైర్మన్

వేదిక జెడ్పీ సమావేశం..

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. చైర్మన్ రాథోడ్ జనార్దన్ అధ్యక్షత వహించగా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సీఈవో గణపతి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మబొజ్జు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వేదిక నుంచి మాట్లాడుతున్న సందర్భంలోనే అధికార పార్టీ ఎమ్మెల్యే బొజ్జు పై వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు దిశనిర్దేశం చేశారని, అధికారులు ఉన్నది ఉన్నట్లుగా చెప్పడమే సరి అన్నట్లు పేర్కొన్నారు.

వాస్తవ పరిస్థితిని తెలియజేయండి..

ప్రభుత్వ తప్పిదాలను మీపైకి తీసుకోవాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బొజ్జు స్పష్టం చేశారు. హుందాగా ఉండాలన్నారు. శాఖల్లో నిధుల్లేవు. అది వాస్తవమని తెలపాలి. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలు ప్రశ్నిస్తారు. ఈ క్రమంలో వారికి వాస్తవ పరిస్థితిని వివరించాలి. ఎవరికో భయపడి పనులు చేయవద్దు. ప్రజలకు మేలు జరిగే పనులే చేపట్టాలంటూ కాంగ్రెస్ సర్కార్ తీరు ఇకపై ఎలా ఉంటుందో అధికారులకు చెప్పకనే చెప్పారు.

కొత్త ఎమ్మెల్యేలకు సన్మానం..

ఉదయం 11.30 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం మొదలైంది. కొత్తగా ఎన్నికైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జును సభ్యులతో పాటు అధికారులు ఘనంగా సన్మానించారు.

ఎజెండా అంశాలపై నామమాత్రంగా చర్చ..

సమావేశంలో ముందుగా విద్యాశాఖతో ఎజెండా అంశాలపై చర్చ షురూ అయింది. మొత్తం 42 అంశాలు ఉండగా కేవలం పదిహేనింటిపైనే చర్చ జరిగింది. ఆ తర్వాత సమావేశం ముగించారు. మన ఊరు మనబడి పథకం అమలుతీరుపై పలువురు సభ్యులు సమావేశంలో లేవనెత్తారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఇంద్రవెల్లి జెడ్పీటీసీ అర్క పుష్పలత, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత సమస్యలను లేవనెత్తారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణంలో అటవీ ప్రాంతాల్లో పనులు చేపట్టాల్సిన కారణంగా పలుచోట్ల పనులు జరగడం లేదని తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి లేవనెత్తిన సమస్యలపై అధి కారులు వివరించారు. ఎన్ఆర్ ఈజీఎస్ ఆడిట్‌లో అక్రమాలకు సంబంధించి సస్పెన్షన్‌కు గురైన అధి కారులు కొద్ది నెలలకే పక్క మండలాల్లో తిరిగి జాబ్ పొందుతున్నారని గుడిహత్నూర్ జెడ్పీటీసీ పతంగి బ్రహ్మానంద్ ప్రశ్నించారు. మొదట అక్రమం అని తేలినప్పటికీ ఆ తర్వాత విచారణలో వారి పాత్రలేదని తేలితేనే పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని డీఆర్‌డీవో కిషన్ తెలిపారు. పంట నష్టం పరిహారం రాలేదని గోక గణేశ్‌రెడ్డి ప్రశ్నించారు.

కలెక్టర్, ఐటీడీఏ పీవో రాకపోతే ఎలా..

సమావేశంలో అధికారుల గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో రాకపోతే ఎలా అంటూ తాంసి జెడ్పీటీసీ రాజు సభాధ్యక్షుడు అయిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌ను అడిగారు. అంతే కాకుండా సమావేశానికి విద్యుత్ శాఖ నుంచి ఎవరు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ నుంచి సీనియర్ అసిస్టెంట్ సమావేశానికి హాజరు కావడంపై విస్మయం వ్యక్తం చేశారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వగలగుతాడా అని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలు శంకర్, అనిల్ జాదవ్‌లు ఎజెండా అంశాలపై చర్చ జరుగుతున్న సందర్భంలో లేకపోవడంతో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల సమస్యలపై అంతగా ప్రస్తావనరాలేదు. అయితే ప్రతి ఎజెండా అంశంలో ఎమ్మెల్యే బొజ్జు ఆ నియోజకవర్గంలోని సమస్యలపై అధికారులను నిలదీయడం కనిపించింది. ప్రతి మూడు నెలలకోసారి జరిగే జెడ్పీ సమావేశంలో అందరు ఎమ్మెల్యేలు, అధికారులుంటే నియోజకవర్గ సమస్యల ప్రస్తావనపై సీరియస్‌గా చర్చ సాగుతుందన్న అభిప్రాయం పలువురు సభ్యుల్లో వ్యక్తమైంది. కాగా, ఎమ్మెల్యేలు శంకర్, అనిల్ కరచాలనం, అలాగే బొజ్జు, అనిల్ ఆత్మీయ ఆలింగనం ఆకర్షణగా నిలిచింది.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి..

కైలాస్‌నగర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సాగినప్పుడే జిల్లా అభివృద్ధి సాధ్యపడుతుంది. రాజకీయలకతీతంగా బాధ్యతతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించాల్సిన అవసరముందని నూతన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, జాదవ్ అనిల్‌కమార్, వెడ్మ బొజ్జు పటేల్ అభిప్రాయపడ్డారు.

‘ఉపాధి’ నిధులు కేటాయించాలి

అధికారులు, నాయకులు తారతమ్యాలు లేకుండా రాజకీయలకతీతంగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి. నా రాజకీయ జీవితం పంచాయతీ వ్యవస్థతోనే ప్రారంభమైంది. గ్రామాల్లోని సమస్యలపై ఎంపీపీలు, జెడ్పీటీసీలకు అవగాహన ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఏమి చేయలేని పరిస్థితి. దాన్ని అధిగమించేలా నిధుల సమీకరణపై దృష్టి సారించాలి. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులను ప్రభుత్వానికి కాకుండా నేరుగా జెడ్పీలకే కేటాయించాలి. ఆ నిధులను వ్యవసాయానికి అనుసంధానం చేసేలా జెడ్పీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలి. – పాయల్ శంకర్, ఎమ్మెల్యే ఆదిలాబాద్

అప్పుల కుప్పగా చేశారు

ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఈ 20 రోజుల్లో పలు మండల సర్వసభ్య సమావేశాలకు హాజరైన నాకు ఎన్నో సమస్యలు తెలిశాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ శాఖలో నిధుల్లేకుండా చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. విషయాన్ని అధికారులు ప్రజలకు తెలియజేయాలి. మిషన్ భగీరథ నీరు ఎక్కడా ప్రజలకుఅందడం లేదు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు వెళ్లిన రోజు మాత్రమే నీళ్లు వస్తాయి. కడెం ప్రాజెక్ట్ గేట్లకు మరమ్మతులు చేయాలా లేక కొత్త గేట్లను అమర్చాలా అనే దానిపై పూర్తిస్థాయిలో డీపీఆర్ అందజేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొచ్చేలా చూస్తా. –వెడ్మ బొజ్జు,ఎమ్మెల్యే, ఖానాపూర్

సమన్వయంతో సాగాలి

జెడ్పీ నాకు దేవాలయం లాంటిది. నాలుగున్నరేళ్లు జెడ్పీటీసీగా పనిచేసిన అనుభవం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక జరిగిన తొలి అసెంబ్లీ సమావేశంలో నాకు ఎంతో ఉపయోగపడింది. ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్‌లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రస్తావించడం దురదృష్టకరం. ప్రజలకు శుద్ధజలాన్ని అందించాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. వంద గ్రామాలకు నీరిచ్చి ఒక్క గ్రామానికి నీరివ్వకపోయిన దాన్నే ప్రస్తావించారు. ఇకపై అలా జరుగకుండా అధికారులు శ్రద్ధ వహించాలి. – జాదవ్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే, బోథ్

క్షేత్ర సందర్శనలు పెంచాలి

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలకు అవరోధంగా మారిన అటవీశాఖ అనుమతులకు సంబంధించిన వివరాలు పది రోజుల్లోగా నాకు అందజేయాలి. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అటవీ, ఆర్అండ్‌బీ శాఖలతో సంయుక్త సమావేశాలను నిర్వహించి సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తాం. మూడు నెలల పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న కారణంగా అధికారులు ఆశాఖలపై అంతగా దృష్టి సారించలేదు. ప్రతి అధికారి విధిగా క్షేత్రస్థాయి సందర్శనలు పెంచాలి. అలా వెళ్లినట్లైతే చిన్నపాటి సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యే వెసులుబాటు ఉంటుంది. – ఖుష్బు గుప్తా, అడిషనల్ కలెక్టర్

- ట్రాఫిక్ చలాన్లపై భారీ డిస్కౌంట్
- 90 శాతం వరకు రాయితీ
- ప్రకటించిన రాష్ట్ర సర్కారు
- వాహనదారులకు ఊరట
- జనవరి 10 వరకు గడువు

బంపరాఫర్!

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి జరిమానాకు గురైన వాహనదారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. 60 నుంచి 90 శాతం వరకు భారీ డిస్కౌంట్ ప్రకటించింది. పెండింగ్‌లో ఉన్న చలాన్ల వసూలు కోసం కోవిడ్ సమయంలో ఓ సారి రాయితీ కల్పించిన విషయం తెలిసిందే. దీనికి అప్పట్లో అనూహ్య స్పందన లభించింది. చాలామంది తమ వాహనాలకు సంబంధించి పెండింగ్ చలాన్లు చెల్లించారు. దీంతో సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. కొంతమంది మాత్రం చెల్లించకుండా పెండింగ్ ఉంచారు. వాహన తనిఖీల్లో భాగంగా ఇలాంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం మరోసారి బంపరాఫర్ ప్రకటించింది. నూతన సంవత్సర కానుకగా రాయితీ కల్పిస్తోంది. వాహనదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది.

సంవత్సరం	కేసులు	జరిమానా	వసూలైన జరిమానా
2022	1,53,828	రూ.4 కోట్ల 56 లక్షలు	రూ.3 కోట్ల 25 లక్షలు
2023 (ఇప్పటివరకు)	4,59,000	రూ.15 కోట్లు	దాదాపు రూ.42 లక్షలు

భారీ ఆఫర్ ఇలా..

జనవరి 10 వరకు ఈ ఆఫర్ ద్వారా చలాన్లు చెల్లించేందుకు గడువు విధించింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలపై ఉన్న చలాన్లకు 80 శాతం, కారు, ట్రక్కులు, భారీ వాహనాలపై 60 శాతం, ఆర్టీసీ డ్రైవర్లు, తోపుడు బండ్లపై ఉన్నవారికి 90 శాతం రాయితీని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి చలాన్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు అవకాశం కల్పించింది. అయితే ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ ఆఫర్‌తో లోక్‌అదాలత్‌లో పెండింగ్ చలాన్లు చెల్లించే అవకాశం ఉండడంతో వారికి కొంత ఊరట లభించనుంది. గత మార్చిలో ట్రాఫిక్ చలాన్లపై ఇదేతరహాలో అప్పటి ప్రభుత్వం డిస్కౌంట్ కల్పించిన విషయం తెలిసిందే. మరోసారి అవకాశం రావడంతో వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

4.59లక్షల కేసులు..

జిల్లాలో ఇప్పటివరకు 4లక్షల 59వేల కేసులు ఉన్నట్లు పోలీసు శాఖాధికారులు చెబుతున్నారు. రూ.15 కోట్ల వరకు పెండింగ్ చలాన్ల రూపంలో ఉన్నాయి. వాహనదారులు ఈ ఆఫర్ ద్వారా చెల్లించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

విస్తృత తనిఖీలు..

జిల్లా అంతటా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రధానంగా పెండింగ్ చలాన్లను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఒకవేళ వాహనదారుడు చలాన్ చెల్లించకుంటే ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ-చలాన్ ద్వారా జరిమానా విధిస్తున్నారు. అలాగే నంబర్ ప్లేట్లకు మరకలు పూయడం, నంబర్ ప్లేట్లు తొలగించడం, వంచడం, నంబర్లు కనిపించకుండా వాహనదారులు ఏదోవిధంగా తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఇలాంటివారిపై కూడాకేసులు నమోదయ్యాయి.

అవకాశం సద్వినియోగం చేసుకోండి

పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి. జనవరి 10వరకు గడువు ఉంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. – డి.ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా అందిస్తున్న సంజీవ్‌రెడ్డి

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంజీవ్‌రెడ్డి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని బోథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్నకు అందజేశారు. రాజీనామా అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ నెల 20వ తేదీన జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో సీసీఐ అక్రమాలపై మాట్లాడానని వివరించారు. సీసీఐకి వ్యాపారస్తుల మధ్య ఏదో ఒప్పందం ఉందన్నారు. సీసీఐలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్‌కు తెలియజేసినా... పట్టించుకోవడంలేదన్నారు. ఆయన తీరు నచ్చకనే తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు అండగా ఉంటూ పోరాడతానని అన్నారు.

తూకంలో మోసం..!



తరుగు వచ్చిన ఉల్లిగడ్డలు చూపిస్తున్న వినియోగదారుడు

కుంటాల: రండమ్మా.. రండి.. కేవలం రూ.100కు మూడు కిలోల ఉల్లిగడ్డలని కుంటాలలో ఓ వ్యాపారి వాడవాడలా ఆటోలో వెళ్తూ విక్రయించాడు. యూనియన్ బ్యాంక్ సమీపంలో ఓ మహిళ రూ.100కి మూడు కిలోల ఉల్లిగడ్డలు కొనుగోలు చేసింది. అవి తక్కువగా ఉన్నాయని అనుమానం వచ్చి శేఖర్ అనే యువకుడు వాటిని తూకం వేయగా అరకిలో తరుగు రావడంతో నివ్వెరపోయి సదరు వ్యాపారిని నిలదీశాడు. గ్రహించిన వ్యాపారి అక్కడి నుంచి ఉడాయించాడు. తూనికల కొలతల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పురుడు పోసిన 108 సిబ్బంది



పాపను కుటుంబీకులకు అందిస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి పురుడుపోసి ఆదుకున్నారు 108 సిబ్బంది వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన బిర్కుల వసంత(32) శనివారం ఏడు గంటలకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. అంబులెన్స్‌లో లక్ష్మణచాందకు చేరుకుని గర్భిణిని నిర్మల్ తరలించే క్రమంలో మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బందే పురుడుపోయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. అనంతరం నిర్మల్ ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. పైలట్ అజార్, ఈఎంటీ సురేష్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యం

- ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఏడాదిగా..
- ఎస్టీ విద్యార్థులకు రెండేళ్లుగా పెండింగ్‌లో నిధులు

ఆదిలాబాద్‌రూరల్: పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే ఇంటర్, ఆపై ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు (ఎంటీఎఫ్), కళాశాలలకు రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు (ఆర్టీఎఫ్) అందజేస్తోంది.

కళాశాలలు ఇలా..

జిల్లాలో ఎస్సీ కళాశాలు 77, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 83 కళాశాలలు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 84కళాశాలలు, మైనార్టీ సంక్షేమశాఖ పరిధిలో 75 కళాశాలల్లో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారనే విమర్శలు లేకపోలేదు.



జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాల

గిరిజన విద్యార్థులకు రెండేళ్లుగా..

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యార్థులకు సంబంధించి 2021–22, 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా విద్యా సంవత్సరాలు కలిపి సుమారు 3వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఎంటీఎఫ్ కింద రూ.3 కోట్లు, ఆర్టీఎఫ్ కింద రూ.4 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన నిధులను సకాలంలో విడుదల చేసి విద్యార్థులకు, కళాశాల యాజమాన్యానికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో నిధులు

2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఈ విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 8,241మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇందులో ఎంటీఎఫ్ కింద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3.73కోట్ల నిధులు విడుదల చేసింది. ఆర్టీఎఫ్ కింద కళాశాలలకు సంబంధించిన రూ.13 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉంది. దళిత అభివృద్ధి శాఖ పరిధిలో 5,698 మంది దరఖాస్తు చేసుకోగా రూ.1.65 కోట్లు విడుద ల కావాల్సి ఉంది. కళాశాలలకు ఆర్టీఎఫ్ కింద రూ. 2.07 కోట్లు వారి ఖాతాలో జమ కావాల్సి ఉంది. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో మొత్తం 2,786 మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోగా 1,669 మంది విద్యార్థులకు ఎంటీఎఫ్ నిధులు విడుదల చేయగా మిగితా 1,117 మంది నిధులు విడుదల కావాల్సి ఉంది. ఆర్టీఎఫ్‌కు సంబంధించి 1,321 మంది విద్యార్థులకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది.

నేరుగా ఖాతాల్లో జమ



ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వానికి పంపించాం. బకాయి ఉన్న నిధులు ప్రభుత్వం విడుదల చేయగానే విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఖాతాలో జమ అవుతాయి. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ దిలీప్‌కుమార్, డీడీ, ఐటీడీఏ, ఉట్నూర్

రైతే దేశానికి వెన్నెముక



కేవీకేలో నిర్వహించిన రైతు దినోత్సవంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

ఎదులాపురం: రైతు దేశానికి వెన్నెముక అని, ఆయన పది వేళ్లు నేలలోకి వెళ్తేనే మన ఐదు వేళ్లు నోట్లోకి వెళ్తాయని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, పోషాద్రి, సునీల్‌కుమార్, శివచరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్ర భవనంలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ప్రతీ రైతుకు రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మాజీ ప్రధాని డాక్టర్ చౌదరి చరణ్ సింగ్ జన్మదినం సందర్భంగా 2001 డిసెంబర్ 23 నుంచి రైతు దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేశానికి అన్నం పెడుతున్నది రైతులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు, ఎత్తుమడుల పద్ధతి, అంతర పంటల సాగు, పంటమార్పిడి, శనగ, సోయా, జొన్న, మొక్కజొన్న యాజమాన్య పద్ధతులు, గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు నివారణ, ఆయిల్‌ఫాం సాగు ఉత్పత్తిదారుల సంఘాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 105 మంది రైతులు హాజరయ్యారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..

భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానికంగా రైతు దినోత్సవం నిర్వహించారు. ఎస్‌బీఐ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, ఇతరతలపై ఉద్దేశించి మాట్లాడారు. డీజీఎం సూర్యకాంత్ దాస్, నిజామాబాద్ ఆర్‌ఎం మన్యం శ్రీకాంత్, ఉద్యోగులు బాలకృష్ణ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. పార్లమెంటు భారతీయ నాగరిక సురక్ష సన్హిత చట్టాన్ని ఆమోదించిందన్నారు. న్యాయవ్యవస్థలో చాల మార్పులు వస్తాయని, ప్రతిఒక్కరూ వాటి గురించి తెలుసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థలో వచ్చిన మార్పులు, చట్టాలను న్యాయవాదులకు వివరించారు. సెక్షన్లు, కోడ్‌నంబర్లు కూడా మారుతున్నాయని, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం క్రైస్తవ సోదరులతో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు ఉన్నారు.

గల్ఫ్ సంక్షేమ పథకాలను అమలు చేయాలి

- ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల
- టీపీసీసీ గల్ఫ్ సెల్ చైర్మన్ వినోద్‌కుమార్‌తో భేటీ



సమావేశంలో గల్ఫ్‌కార్మిక సంఘాల నాయకులు

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేయాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన తెలంగాణ పీసీసీ గల్ఫ్ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డితో కూడిన బృందంతో కలిసి టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు గల్ఫ్ కార్మిక ప్రభావిత ప్రాంతాల ఎమ్మెల్యేలు, గల్ఫ్ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సాధ్యమైనంత త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో వీరితో పాటు గల్ఫ్ సంఘాల నాయకులు మంద భీంరెడ్డి బైరదేవ్ యాదవ్, మాదం వినోద్, రంజిత్, తేల్ భాషా పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి

ఎదులాపురం: తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎండీఎం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎండీఎం కార్మికులకు రూ.10 వేలు పెంచుతామని మెనిఫెస్టోలో చేర్చారని హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఆర్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే నింపి ఇవ్వాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరుడి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: అయ్యప్ప దీక్షాపరుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ కాలనీకి చెందిన అంబల సురేష్(47) స్థానిక మంచిర్యాల చౌరస్తాలో ఎస్ బేకరీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాల్కొండ నియోజకవర్గంలోని కిసాన్ నగర్ నుంచి నిర్మల్‌కు వలసవచ్చాడు. 22ఏళ్ల నుంచి అయ్యప్ప మాల స్వీకరిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఆరు గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్య తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూసి చుట్టుపక్కల వారిని పిలిచింది. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు తలుపులు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఫోన్‌ను పరిశీలించగా ఆరోగ్య సమస్యలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాయిస్ మెసేజ్ పెట్టాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్సై శంకర్ తెలిపారు. సురేశ్‌కు భార్య, కూతురు ఇంటర్ చదువుతుండగా, కొడుకు బీటెక్ చదువుతున్నాడు.



అంబల సురేష్(ఫైల్)

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

జైనథ్: మండలంలోని మేడిగూడ–ఆర్ గ్రామానికి చెందిన అరుగుల దేవన్న కుమారుడు అరుగుల రాంచరణ్(16) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... దేవన్న చాకలి పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రాంచరణ్ జైనథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా నొప్పి ఎక్కువ కావడంతో కళాశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం కుటుంబీకులు ఇంటికి వచ్చి చూడగా ఇనుప కడ్డీకి వేళాడుతూ కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.



అరుగుల రాంచరణ్(ఫైల్)

యువకుడి హత్యకు రూ.15లక్షల సుఫారీ

- జీపుతో ఢీకొట్టి ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- ప్రేమ వ్యవహారమే కారణం..
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఉమేందర్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రేమ వ్యవహారంలో ఈ నెల 18న మావల మండల కేంద్రానికి చెందిన ఎంబడి వంశీపై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. శనివారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. మావల గ్రామానికి చెందిన వంశీని హత్య చేసేందుకు కౌన్సిలర్ రఘుపతి ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీకి చెందిన చౌహాన్ రవితో రూ.15లక్షలతో ఒప్పందం చేసుకున్నాడు. రెండేళ్ల కిందట రఘుపతి ఆయన ఫామ్‌హౌస్‌కు వంశీని తీసుకుని వెళ్లి ప్రేమ వ్యవహారానికి దూరంగా ఉండాలని మందలించాడు. అయినప్పటికీ వంశీ, ఆ యువతి తరచుగా మాట్లాడుకోవడం తెలుసుకున్న రఘుపతి ఎలాగైనా వంశీని చంపాలని నిర్ణయించుకున్నాడు. గతంలో దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన చౌహాన్ రవి, అతడి మిత్రుడు అశోక్ ఇద్దరు కలిసి గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత నెల 25న శాంతినగర్‌లో ఎన్నికల ప్రచారంలో రవి రఘుపతిని కలిశాడు. ఆ సమయంలో రఘుపతి ఓ హత్య చేయాలని, రూ.15లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్ కింద రవికి రూ.లక్ష ఇచ్చాడు. గత నెల 28న రవి, అశోక్‌లు దస్నాపూర్‌లోని రఘుపతి ఆఫీస్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఆఫీస్ ముందు నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వంశీని చూపించాడు. రఘుపతి భార్య అరుంధతి సైతం వంశీని ఎలాగైనా చంపి పరువును కాపాడాలని కోరింది. అలాగే అశోక్‌కు రూ.5లక్షలు రవికి ఇస్తానని హామీ ఇచ్చాడు. అక్కడి నుంచి వీరిద్దరూ వంశీ ఇంటికి వెళ్లి రెక్కి నిర్వహించారు. అశోక్‌కు రవి జీపు కావాలని చెప్పగా అశోక్ ఆయన స్నేహితుడైన దిల్షాద్‌కు చెప్పాడు. అందుకు జీపు ఓనర్‌కు రూ.20వేలు, మాట్లాడినందుకు దిల్షాద్‌కు రూ.20వేలు ఇస్తానని చెప్పాడు. దిల్షాద్ జీపు ఓనర్ రాజుతో ఫోన్‌లో మాట్లాడి ఆదిలాబాద్ పట్టణంలోని వినాయకచౌక్‌లో కలుసుకున్నారు. జీపుతో ఒకరిని ఢీ కొట్టి హత్య చేయాల్సి ఉందని, అందుకు రూ.20వేలు ఇస్తానని రాజుతో ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 17న రవి, అశోక్‌లు దిల్షాద్‌ను కలిసి జీపు తీసుకురావాలని చెప్పాడు. వంశీ ఈ నెల 18న తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో మణిపూర్ కాలనీలో డెయిరీఫాంకు వెళ్తుండగా అశోక్ జీపుతో ఢీకొట్టాడు. ఆ సమయంలో రవి జీపు వెనుకాలో కూర్చున్నాడు. ఈ ప్రమాదంలో వంశీ కిందపడిపోగా మళ్లీ జీపును రివర్స్ తీసుకుని ముందుకు వెళ్లే క్రమంలో విద్యుత్ స్తంభానికి ఢీకొట్టగా స్తంభం విరిగి ద్విచక్ర వాహనంపై పడడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఆ సమయంలో వంశీ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో బాధ్యులైన కేఆర్కే కాలనీకి చెందిన చౌహాన్ రవి, జి.అశోక్, ఆదిలాబాద్ పట్టణంలోని అబ్దుల్లా చౌక్, ఖానాపూర్‌కు చెందిన షేక్ దిల్షాద్, జైనథ్ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన రాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.18,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, ఆయన భార్య అరుంధతిలు పరారీలో ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ రూరల్, జైనథ్, సీసీఎస్ సీఐలు సైదారావు, నరేష్, సాయినాథ్, మావల ఎస్సై విష్ణువర్ధన్, ఐడి పార్టీ రమణయ్య, కరీం, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు, సీసీఎస్ సీఐ సాయినాథ్, ఎస్సై విష్ణు వర్ధన్‌లు ఉన్నారు.

కల్లూర్ వైన్స్‌లో చోరీ



నమూనాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కుంటాల: మండలంలోని కల్లూర్ శ్రీలక్ష్మిసాయి వైన్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. కుంటాల ఎస్సై హన్మాండ్లు వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వైన్స్ తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. రూ.92వేల800 విలువ గల మద్యం బాటిళ్లను దొంగిలించారు. దుకాణం ఎదుట గల సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. క్లూస్ టీం బృందం సభ్యులు వచ్చి నమూనాలను సేకరించారు. సంఘటన స్థలాన్ని భైంసా రూరల్ సీఐ నైలు నాయక్ పరిశీలించారు. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు వివరించారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

భైంసాటౌన్: పట్టణంలోని కమల థియేటర్ రోడ్డులో వివేకానందచౌరస్తా సమీపంలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు సీసీ ఎస్ సీఐ మల్లేశ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రకాశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా మహ్మద్ జాకీర్ అహ్మద్‌కు చెందిన దుకాణంలో 12క్వింటాళ్ల రేషన్‌బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించాడు. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థుల హవా..

- బంగారు పతకాలు కైవసం
- స్టేట్ గేమ్స్ ఫెస్టివల్‌లో సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ
- జాతీయ స్థాయికి ఎంపిక



సచిన్



సతీష్



గంగాప్రసాద్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సచిన్, సతీష్, గంగాప్రసాద్ స్టేట్‌గేమ్స్ ఫెస్టివల్‌లో సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మూడు రోజుల నుంచి నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న స్టేట్ గేమ్స్ ఫెస్టివల్‌లో ఇచ్చోడ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

మంత్రి సీతక్కను కలిసిన అరుణ్‌కుమార్

బోథ్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ను ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఇటీవల ఏఐసీసీ విచార విభాగ్ తెలంగాణ కో ఆర్డినేటర్‌గా నియమితులైన అరుణ్‌కుమార్‌కు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న అరుణ్‌కుమార్

ఖైరీలో భారీ అగ్ని ప్రమాదం

కెరమెరి: మండలంలోని ఖైరీలో శనివారం విద్యుత్ మీటర్‌లో జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన నాలుగిళ్లు దగ్ధమయ్యాయి. మొహర్లే గిర్మాజీకి చెందిన 30 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష నగదు, తులం బంగారం, మొహర్లే చంద్రయ్యకు చెందిన 20 క్వింటాళ్ల పత్తి, రూ.20 వేల నగదు, తులం బంగారం, మొహర్లే సోమయ్య, కమలామాయికి చెందిన ఇంటి సామగ్రి, ఇల్లు కాలిపోయాయి. ఘటన సమయంలో కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. అప్పటికే గ్రామస్తులు నీళ్లు పోసి మంటలను అదుపులోకి తీసుకరాగా రెండు గంటన్నర తర్వాత ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ తుర్పత బాయి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. అధికారులతో మాట్లాడి పరిహారం అందిస్తామన్నారు. వారి వెంట సర్పంచ్ విజయలక్ష్మి, న్యానేశ్వర్, నాయకులు ఉన్నారు.